మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

కురుమూర్తి జాతరకు టెండర్లు

చిన్నచింతకుంట, ఆగస్టు 20 ప్రభాతవార్త : మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలోని వెలసిన శ్రీకురుమూర్తిస్వామి జాతరకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. కురుమూర్తిస్వామి వారి జాతర బ్రహ్మోత్సవాలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో జాతరకు సంబంధించి బుధవారం జాతర మైదానంలోని అన్నదాన సత్రంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యుల నేతృత్వంలో బహిరంగ టెండర్లను నిర్వహించారు. జాతరలో లడ్డూ, పులిహోర విక్రయానికి రూ.46 లక్షల గత ఏడాది రూ.45 లక్షలు తలనీలాలకు సంబంధించి రూ.32 లక్షలు గత ఏడాది 25 లక్షలు విద్యుత్ వాడకానికి సంబంధించి రూ.13 లక్షల 33 వేలు పలకగా, గత ఏడాది రూ.10లక్షల 75 వేలు పలికింది. అయితే టెంకాయలు, పూలు పూజా సామాగ్రి టెండర్ల ప్రక్రియ వాయిదా పడ్డాయి. వీటికి సంబంధించిన టెండర్ తేదిని త్వరలో ప్రకటిస్తామని దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కథలప్ప, పాలకమండలి సభ్యులు, టెండర్ దారులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివద్ధే లక్ష్యం

గ్రామీణాభివృద్ధి - ఉపాధి భరోసా - మౌలిక సదుపాయాల మెరుగుదల

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త : జిల్లాలో ఉపాధి హామీ పథకం పనుల జాతర-2025లో భాగంగా ఈ నెల 22వ తేదీ నుంచి ప్రతి గ్రామపంచాయతీలో కొత్త పనులు ప్రారంభం కానున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం తెలిపారు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం విజయవంతంగా నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల జాతర ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. పనుల జాతర 2024లో భాగంగా గత నవంబర్ 26న భూసంస్కరణ, పశువుల పాకలు, నాడెప్ కంపోస్ట్ పిట్స్, పౌల్ట్రీ షెడ్స్, పొలం బాటలు, చెక్‌డ్యాంలు, ఊటకుంటలు, బోర్ వెల్ రీచార్జ్, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు వంటి పనులకు శ్రీకారం చుట్టగా, మార్చి 31, 2025 నాటికి విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ఈ విజయాన్ని కొనసాగిస్తూ పనుల జాతర - 2025లో భాగంగా ఆగస్టు 22న అన్ని గ్రామపంచాయతీల్లో పశువుల పాకలు, మేకల పాకలు, అజోల్లా యూనిట్లు, చెక్‌డ్యాంలు, పౌల్ట్రీ షెడ్స్, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, స్కూల్ టాయిలెట్స్, సానిటరీ కాంప్లెక్సులు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు వంటి పనులకు భూమి పూజలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు.

అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పరిశీలన..

బ్రిడ్జి పనులను పునః ప్రారంభించి అందుబాటులోకి తెస్తామని హామీ

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి

బ్రిడ్జిని పరిశీలిస్తున్న చిన్నారెడ్డి

శ్రీరంగాపూర్, ఆగస్టు 20 ప్రభాతవార్త : శ్రీరంగాపురం మండలం జానంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు వివిధ ప్రమాదాలలో గాయపడిన వారిని పరామర్శించడం జరిగింది. జానంపేట పునాదిపురం మధ్యలో ఉన్న వాగుపై నిర్మిస్తున్న పనులను పరిశీలించడం జరిగింది. ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే పనులను పునః ప్రారంభిస్తామని రైతులకు హామీ ఇవ్వడం జరిగింది. చాలా గ్రామాల ప్రజలకు నేషనల్ హైవే రోడ్డు ఈ మార్గంలో దగ్గరవుతుందని, పంట పొలాలకు - మిగతా4లో..

రేపు పనుల జాతర

- ప్రతి గ్రామ పంచాయతీ నిర్వహించాలి - జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు20, ప్రభాతవార్త : పనుల జాతర 2025లో భాగంగా ఆగష్టు 22 రోజున జిల్లాలో అన్ని గ్రామపంచాయతిలలో భారీ ఎత్తున పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గత సంవత్సరం చేపట్టి పూర్తి అయిన పనులను ప్రారంభం, కొత్తగా చేపట్టిన పనులకు భూమి పూజ చేసి మొదలు పెట్టాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.పి.డి..ఓ లు, ఏం.పి. ఓ లు, ఏ.పి. ఎం.లు, ఏ.పి.ఓ.లు, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ ఏ.ఈ.లు, పంచాయతీ కార్యదర్శులతో వెబెక్స్ సమావేశం నిర్వహించి పనుల జాతరలో భాగంగా నిర్వహించాల్సిన పనులపై దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా మంత్రి, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులను ఆహ్వానించి వారి చేత గత సంవత్సరం చేపట్టి పూర్తి అయిన పనులను ప్రారంభించడం, కొత్తగా గుర్తించిన పనులకు భూమి పూజ నిర్వహించాలని కోరారు.. మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద పశువల పాకలు, మేకల పాకలు, అజోల్ల, చెక్ డామ్స్. నాడెప్ కంపోస్ట్ పిట్, పౌల్ట్రీ షెడ్స్, వ్యక్తి గత ఇంకుడు గుంతల పనులు, పంచాయతీ రాజ్ శాఖ క్రింద గ్రామ పంచాయతీ, అంగన్‌వాడి భవనములు, స్కూల్ టాయిలెట్స్, అంగన్‌వాడి టాయిలెట్స్ పనులు, స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద కమ్యూనిటీ సోక్ పిట్, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ పనులుకు భూమి పూజచేయాలని తెలిపారు. పనులజాతర2025లో భాగంగా 3068 పనులకుగాను రూ.59.41కోట్ల అంచనాలతో కొత్తగా పనులు భూమి పూజ చేసి ప్రారంభించి పూర్తిచేయడం జరుగుతుందని తెలిపారు. పనులజాతర 2024లో భాగంగా 26నవంబర్ 2024రోజున జిల్లాలో అన్ని గ్రామపంచాయతిలలో భారీఎత్తున పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ పనులకు భూమి పూజ చేసినట్లు తెలిపారు ఇందులోమహిళ శక్తి ఉపాధిభరోసా క్రింద పశువుల పాకలు, అజోల్ల, నాడెప్ కాంపోస్ట్ పిట్, పౌల్ట్రీ షెడ్స్, భుమి అభివృద్ధి పనులు. పొలం బాటలు క్రింద పొలాలకు వెళ్ళే రహదారుల పనులు, జలనిధి (జల సందాయని జన భాఖిదారి) క్రింద చెక్ డామ్స్, ఊట కుంటలు, పారం పాండ్స్, రూప్ టాప్ రేన్ వాటర్ హర్ వేస్టింగ్ పనులు, బోర్ వెల్ రీచార్జ్ పనులు, ఇంకుడుగుంతలు, సి.సి రోడ్లు, గ్రామ పంచాయతీ మరియు అంగన్ వాడి భవనముల పనులను భూమి పూజ చేసి ప్రారంభించి, 31మార్చికి 2025 లోపల 1943 పనులను పూర్తి చేసి, 40.62 కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ పూర్తిచేసిన పనులను ఆగస్టు 22 న ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్.డి.ఓ నర్సింహులు, అదనపు పి.డి.లు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

రైతు సేవా కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర, ఆగస్టు 20 ప్రభాతవార్త: ప్రజల ఆశీర్వాదం, దీవెనలతో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అనేక సేవలను అందించడానికి కృషి చేస్తుందని, రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జీ .మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం దేవరకద్ర మండల కేంద్రంలో హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ (హాక)రైతు సేవా కేంద్రాలను ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి. ముందుగా ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డికి, హాకా రైతు సేవ కేంద్రాల నిర్వహకులు స్వాగతం పలికి, పూల బొకే, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ హాక సేవా కేంద్రం ద్వారా మెరుగైన సేవలను అందిస్తూ, రైతుల నమ్మకాన్ని - మిగతా4లో..

బైక్ పైనే బడికి..

- తల్లిదండ్రుల నిర్లక్ష్యం..
- పట్టించుకోని అధికారులు, పాఠశాల యాజమాన్యం

జడ్చర్ల ఆగస్టు 20, ప్రభాతవార్త: డ్రైవింగ్ లైసెన్సు పొందాలనుకునే వారు కనీస వయసు 18 సంవత్సరాలు నిండి ఉండాలి ఇది ఆర్టీవో నిబంధన. ప్రాంతీయ రవాణా కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఒక టెస్ట్ నిర్వహించిన అనంతరం లర్నింగ్ లైసెన్స్ ఇస్తారు.. అప్పుడు కూడా వారు 'ఎల్' బోర్డు పెట్టుకొని ద్విచక్ర వాహనం నడపాల్సి ఉంటుంది. తదుపరి ఒరిజినల్ లైసెన్సులు తీసుకొని రోడ్ల పైన వాహనాలు నడపాలి. అయితే ఇవేమీ తమకు పట్టవు.. లైసెన్సు ఉంది అని కూడా తెలియని వయస్సు వారిది. తల్లిదండ్రులు సైతం పిల్లలకు వాహనాలు ఇవ్వద్దు అన్న కనీస నియమ నిబంధనలు కూడా పాటించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. అందుకు నిదర్శనమే పిల్లలు బైకులపై పాఠశాలకు వెళ్లడం. పాఠశాల యాజమాన్యం సైతం పట్టించుకోకపోవడం, తల్లిదండ్రులు పిల్లల పట్ల నిర్లక్ష్యంగా ఉండడం, అధికారులు సైతం తమకు పట్టనట్టు వ్యవహరించడం గమనార్హం. జడ్చర్లలో పలు సందర్భాలలో పాఠశాల విద్యార్థులు బైకులపై అతివేగంగా అతి నిర్లక్ష్యంగా నడుపుతూ వెళ్తున్న దృశ్యాలను 'వార్త' క్లిక్ మనిపించింది.

ప్రాజెక్టులకు భారీ వరద

- ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ
- శ్రీశైలం డ్యాంకు 4.29లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 10గేట్లు 18అడుగులు ఎత్తి సాగర్‌కు నీటి విడుదల
- జూరాల 44గేట్లు ఎత్తివేత

శ్రీశైలం 10గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 20, ప్రభాతవార్త : ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతున్నది. కృష్ణమ్మ ఉగ్రరూపం చూపిస్తున్నది. కర్ణాటకలోకి ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలకు భారీ వరద చేరుతున్నది. నారాయణపూర్ జలాశయానికి 2,50,000 ఇన్‌ఫ్లో నమోదు కాగా, 30గేట్లు ఎత్తి దిగువకు 2,60,280క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పూర్తి సామర్థ్యం 33.313 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 27.37 టీఎంసీలకు చేరింది.

10గేట్లు..18అడుగులు..

శ్రీశైలానికి సుంకేసుల, జూరాల డ్యాంల నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నది. బుధవారం సాయంత్రం 3గంటల సమాచారం మేరకు శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 11,195క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 2,89,627క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,39,100క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం 10 గేట్ల 18అడుగుల మేర ఎత్తి దిగువ సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 881.90అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 198.3623టీఎంసీలకు చేరింది. డ్యాంకు 4,78,032 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా 4,20,370క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. విద్యుత్ ఉత్పత్తి కోసం 65,507 క్యూసెక్కులు విడుదల చేయగా కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

జూరాల 44గేట్లు ఎత్తివేత..

ఉమ్మడి పాలమూరు వరప్రదాయిని జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతున్నది. దీంతో 44గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయానికి 2,92,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా - మిగతా4లో..

రైతులకు ఎరువులు అందేలా చర్యలు చేపట్టాలి

గద్వాల కలెక్టర్ బి.యం.సంతోష్

ఎరువుల సరఫరాపై అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్

గద్వాల టౌన్ ఆగస్టు 20, ప్రభాతవార్త: రైతులకు అవసరమైన ఎరువులు సమయానికి అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసీ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ శాఖ అధికారులతో రైతులు సాగు చేసిన పంటల విస్తీర్ణం, యూరియా నిల్వలు, విక్రయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లాలో నిలువగా ఉన్న 543 మెట్రిక్ టన్నుల యూరియాను పద్ధతి ప్రకారంగా అవసరం ఉన్న రైతులకి పంపిణీ చేయాలని, యూరియా పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాకు వచ్చే కొత్త యూరియా నిల్వలను పూర్తిగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారానే రైతులకు అందజేయాలని, ఇతర ఆగ్రో షాపులకు వాటిని కేటాయించరాదని ఆయన స్పష్టం చేశారు. గత సంవత్సరం - మిగతా4లో..

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ప్రజా పాలనలో ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు

- రాజాపూర్ మండలానికి 433 కొత్త రేషన్ కార్డులు
- రూ.30 లక్షలతో సిసి రోడ్డు, అండర్ డ్రైనేజ్ పనులకు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

రాజాపూర్, ఆగస్ట్ 20, ప్రభాతవార్త : రాష్ట్రంలోనీ పేదల ఇళ్లల్లో ఆకలికేకలు లేకుండా చూడటమే మా ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని జడ్చర్ల శాసన సభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి వెల్లడించారు. బుధవారం రాజాపూర్ మండల కేంద్రంలోని జెకె ప్యాలెస్‌లో నిర్వహించిన నూతన రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, మండల కేంద్రంలో రూ. 30 లక్షలతో వేస్తున్న సిసి రోడ్డు అండర్ డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి పేదల సంక్షేమమే ప్రథమ కర్తవ్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రేషన్ కార్డు కేవలం ఒక పత్రం కాదు, ఇది ప్రతి పేద కుటుంబానికి భరోసా అని ప్రస్తావించారు. భవిష్యత్తుకు ఆర్థిక బలంతో పాటు, పేదల ఆకలి తీర్చడమే కాకుండా, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో ఈ ప్రక్రియ కీలకమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కానీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. మా పాలనలో ఎవరు ఆకలితో ఉండరని, ప్రతి అర్హుడికి సకాలంలో ప్రభుత్వం అందించే లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

కొత్త రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- వర్షాకాలంలో డెంగ్యూ, వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి..
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

రోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 20 ప్రభాతవార్త: రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని సందర్శించి, ఐసీయూలో రోగులకు అందించే చికిత్సను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ ఆసుపత్రి అన్ని విభాగాలను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వైద్యులకు సూచించారు. అలాగే ఆసుపత్రిలో సిబ్బంది వివరాలు, వైద్యుల వివరాలు తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో రోగులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ఈ సందర్భంగా వారు పొందుతున్న వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగుల అవసరాలు, చికిత్స విధానం, మందుల అందుబాటు వంటి అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల కారణంగా ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన ఔషధాలు, పరీక్షా సదుపాయాలు, శుభ్రమైన వసతులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని ఆయన సూచించారు. ప్రతిరోజు ఓపీకి ఎంత మంది వస్తున్నారని కలెక్టర్ ఆరా తీశారు. వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి సేవలందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని కలెక్టర్ సందర్భంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సీజనల్ వ్యాధులతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వైద్యులకు సూచించారు. సీజనల్ జ్వరాలపై సమయానికి గుర్తింపు, సరైన చికిత్స చాలా ముఖ్యమని అన్నారు. ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగిని శ్రద్ధగా పరిశీలించి అవసరమైన మందులు, పరీక్షలు తక్షణమే అందించాలన్నారు. టైఫాయిడ్, కలరా, చికెన్ గున్యా, మలేరియా, డెంగ్యూ, మొదడు వాపు, జ్వరం, పైలేరియా, వీరోచనాలు, తదితర అంటువ్యాధులకు అవసరమైన మందులు చికిత్స అందించేందుకు ఆస్పత్రి వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే రోగుల వ్యక్తిగత, పరిశుభ్రతతో పాటు ఆసుపత్రి పరిసరాల అపరిశుభ్రత అంటువ్యాధుల వ్యాప్తికి జరగకుండా కట్టడి చేయాలన్నారు. కలుషిత నీరు, ఆహారం, అపరిశుభ్రత, దోమలు, ఈగలు కీటకాలు, పందులు, తదితర జంతువుల ద్వారా సీజనల్ వ్యాధులపై రోగులకు అవగాహన కల్పించాలని, అలాగే రోగుల వ్యక్తిగత, పరిశుభ్రతతో పాటు ఆసుపత్రి పరిసరాల అపరిశుభ్రత అంటువ్యాధుల వ్యాప్తి జరగకుండా కట్టడి చేయాలన్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు జిల్లా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి ఆర్.యం.వో డాక్టర్ అజీమ్, డాక్టర్ రోహిత్, డాక్టర్ ప్రమోద్, ఇతర వైద్యులు తదితరులు ఉన్నారు.

కృష్ణమ్ వందే జగద్గురుమ్

- త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

- మద్దిగట్ల,కొత్తమొల్గర,వెల్కిచర్లలో కృష్ణుని ఊరేగింపు శోభాయాత్రలు

భూత్పూర్,ఆగస్టు 20,ప్రభాతవార్త : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందు జ్ఞానవేదిక మద్దిగట్ల కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకలు ఈ నెల 16న కృష్ణాష్టమి సందర్భంగా శనివారం మద్దిగట్లలో ఆరంభమైన ఈ వేడుకలు బుధవారం వరకు ఐదు రోజుల పాటు ఘనంగా జరిగాయి. తొలిరోజు మద్దిగట్లలో ఎమ్మెల్యే జీఎంఆర్ ఆయన సతీమణి కవిత దంపతులు శ్రీకృష్ణభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు శోభాయాత్రను ప్రారంభించారు. అనంతరం పాతమొల్గర.కొత్తమొల్గర గ్రామాలతో పాటు చివరి రోజు బుధవారం 20వ తేదిన వెల్కిచర్లలో భారీ ఊరేగింపుతో ముగిసింది.వేడుకల నిర్వహణ బాధ్యతను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తీసుకుని వేడుకల్ని ఘనంగా నిర్వహించారు.

శ్రీకృష్ణభగవానుని శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్, ఆగస్టు 20 ప్రభాతవార్త: ప్రభుత్వ డిగ్రీ కళాశాల దేవరకద్రలో ఇంగ్లీష్, రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం చరిత్ర బోధించుటకు 2025, 26 విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు డా. కె. పద్మావతి తెలిపారు. దరఖాస్తు చేయాలనుకున్న అభ్యర్థులు సంబంధిత పీజీలో కనీసం 55 మార్కులు, ఎస్సీ ఎస్టీలు అయితే 50 మార్కులు పీజీలో కలిగి ఉండాలనీ, పీహెచ్డీ, నెట్, సెట్ అర్హత గల అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను రేపటి వరకు దేవరకద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు ఈనెల 23న ఉదయం 11 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల దేవరకద్రలో ఇంటర్వ్యూలు నిర్వహించబడుతుందని డా.కే పద్మావతి తెలిపారు.

రాజీవ్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా

ఆత్మకూర్ ఆగస్టు 20, ప్రభాతవార్త: భారతదేశానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాన్ని పరిచయం చేయడమే కాకుండా భవిష్యత్తు భారతాన్ని నిర్మించిన స్వర్గీయ దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా విజ్ఞప్తి చేశారు. బుధవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని గాంధీ చౌరస్తాలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1990 దశకంలోనే భారతదేశాన్ని భవిష్యత్తు అగ్రగామిగా కలలు నిజం చేసేందుకు ఐటీ రంగాన్ని భారతదేశానికి పరిచయం చేసి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాజీవ్ గాంధీ చేసిన సేవలను ఆయన కొనియాడారు. ప్రస్తుతం భారతదేశం ప్రపంచ రంగంలో మూడవ ఆర్థిక శక్తిగా ఎదగడానికి ప్రధాన కారణం ఆనాడు రాజీవ్ గాంధీ మరియు దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చేసిన సేవలే ఈరోజు పనికి వస్తున్నాయని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు మండల పార్టీ అధ్యక్షులు పరమేష్ మక్తల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ కాంగ్రెస్ నాయకులు మొగిలి గంగాధర్ గౌడ్, పిన్నంచర్ల కాజన్న, మని వర్ధన్ రెడ్డి గణేష్ గాలి పంపు శ్రీనివాసులు తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆత్మకూరులో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పిచ్చికుక్కల బెడదలకు పశువులు బలి

ఉప్పునుంతల,ఆగస్టు20 ప్రభాతవార్త : మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో పిచ్చి కుక్కల బెడదతో గ్రామంలో మూడుపశువులు బలయ్యాయి. గ్రామానికి చెందిన సామచంద్రయ్య రెండు ఆవులు పిచ్చికుక్కలదాడిలో తీవ్రగాయాలై మృత్యువాత పడ్డాయి. అదేవిధంగా మాడుగుల శ్రీనుకు చెందిన ఎద్దును పిచ్చికుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి.చికిత్స పొందుతూ మృత్యువాత పడింది. దీంతో గ్రామంలో పిచ్చి కుక్కల బెడద అధికమై రోజురోజుకు పరిస్థితి చేజారుతుందని , అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పిచ్చికుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పిచ్చికుక్కల దాడితో మూడు పశువులు మృత్యువాత పడ్డాయని మరి ఏం జరుగుతుందో అని రైతులు, గ్రామస్తులు ఆందోళన గురవుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మృతి చెందిన ఎద్దు, ఆవుల యజమానులకు నష్టపరిహారం చెల్లించి పిచ్చి కుక్కల సైరవిహారాన్ని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే తాము ఆందోళన చేపడతామని మామిళ్ళపల్లి గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

కస్తూర్బా విద్యార్థినులకు చట్టాలపై అవగాహన

గద్వాలటౌన్ ఆగస్టు 20, ప్రభాతవార్త: జిల్లాన్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గద్వాల్ జిల్లా, గోనేపాడు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ సభ్యులు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు చట్టసంబంధిత అంశాలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బాలికల హక్కులు, బాల కార్మిక నిషేధ చట్టం, బాల్యవివాహాలు, పి ఓ సి ఎస్ ఓ చట్టం తదితర అంశాలపై వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమం వారి చట్టపరమైన అవగాహనను పెంచడమే కాకుండా, ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంపొందించిందన్నారు . ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ మాట్లాడుతూ, డ్రాప్‌ఔట్స్ విద్యార్థులను తగ్గించడమే కాకుండా, పాఠశాల హాజరును పెంచడం అత్యంత అవసరమన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం కలిసి విద్యపై అవగాహన కలిగించాలనీ, విద్యా ప్రాధాన్యతను తెలియజేస్తూ ప్రత్యేక శిబిరాలు, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాలల హక్కుల గురించి తెలియజేసే కార్యక్రమాలు కూడా ఉపయుక్తంగా ఉంటాయనీ , ప్రభుత్వం అందించే సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లు, మిడ్‌డే మీల్స్ వంటివి సరైన రీతిలో అమలులోకి వస్తే పిల్లలు పాఠశాలకు హాజరు కావడానికి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ వి. రాజేందర్, బి. శ్రీనివాసులు, డి. లక్ష్మణ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఉప్పునుంతలలో బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

ఉప్పునుంతల, ఆగస్టు 20 ప్రభాతవార్త : రేపు శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు తెలిపారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల కొత్త యశోద ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే, తాజా అచ్చంపేట ఇంఛార్జి మర్రి జనార్దన్ రెడ్డి హాజరవుతున్నందున మండలంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, మాజీ ఎంపిటిసి లు, మాజీ సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్టాపన

ఆత్మకూర్ ఆగస్టు 20, ప్రభాతవార్త : ఆత్మకూరు మండలంలోని మోట్లపల్లి గ్రామంలో బుధవారం రోజు గ్రామ దేవత పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పలువురు నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసం నెల అనంతరం గ్రామంలో పోచమ్మ తల్లి మొక్కుబడులు చెల్లించు కునేందుకు చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వ హించినట్లుగా పలువురు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ రేచింతల సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి తదిత రులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకొని కలిసిమెలిసి జీవితాలను కొనసాగించేందుకు కట్టుబడి ఉండాలని భక్తి భావం పెంపొందితేనే సమాజంలో అశాంతి లేకుండా ఉండగలుగుతారని వారి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు వైస్ ఎంపీపీ కోటేశ్వర్ టిఆర్ఎస్ నాయకులు వీరేశలింగం రామకృష్ణ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.అనంతరం పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న పలువురిని గ్రామస్తులు ప్రత్యేకంగా శాలువాలతో సన్మానం నిర్వహించారు.

పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన నిర్వహిస్తున్న దృశ్యం

యూరియా కోసం రైతుల పడిగాపులు

గద్వాల టౌన్ ఆగస్టు 20, ప్రభాతవార్త: జిల్లాలో నెలకొన్న యూరియా కొరత వల్ల రైతులు పీ ఏ సి ఎస్ సెంటర్ల దగ్గర రైతులు పడిగాపులు కాస్తున్నారు. బుధవారం యూరియ కోసం వచ్చిన రైతులు పాత ఎంపీడీఓ కార్యాలయం దగ్గర బారులు తీరారు. ఎంతకు యూరియా సరఫరా చేయకపోవడంతో అంబేద్కర్ చౌరస్తా లో రోడ్ పై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు బిఆర్ యస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు మద్దతు పలికారు. ఈ సందర్భంగా బాసు హనుమంతు మాట్లాడుతూ రైతులకు సమయానికి యూరియా సరఫరా చేయడంలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఆరోపించారు. రైతులకు సరిపడా యూరియా వెంటనే సరఫరా చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రాని కొరత ఇప్పుడు ఎందుకు వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత వారం రోజుల నుంచి రైతులు, వివిధ మండలాల సొసైటీల దగ్గరకు వచ్చి యూరియా కోసం పడిగాపులు కాస్తే ఒక్క బస్తా ఇస్తామని చెప్పడం బాధాకరం అన్నారు. దేవుడు దర్శనమైన దొరుకుతుందేమో కానీ.. ఎరువుల బస్తా దొరకడం లేదని రైతులు చెప్పడం ప్రభుత్వం రైతులపై చూపిస్తున్న నిరక్ష్యానికి నిదర్శనమన్నారు. ఓటీపీ విధానం తీసివేసి రైతులకు సరిపడా యూరియా అందించాలన్నారు. నానో యూరియా వాడడంతో రైతులకు ఎకరాకు రూ.500 భారం పడుతున్నదని, ప్రభుత్వం సబ్సిడీ నుంచి తప్పించుకోవడానికి కృత్రిమ ఎరువులు సృష్టిస్తున్నదని వారు ఆరోపించారు. ఇక్కడ నుంచి పక్కనే ఉన్న కర్ణాటక కు ఎరువులు తరలిస్తున్నారని, రాష్ట్రంలో 8 మంది ఎంపీలు,ఇద్దరు కేంద్ర మంత్రులు తెలంగాణ నుంచి ఉండి ఎరువుల కొరత తీర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు.

రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన రైతులు

నిరసనకు మద్దతు పలికిన బాసు హనుమంతు నాయుడు

ధర్నా విరమించాలని బిఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ మొగలయ్య

51సార్లు ఢిల్లీకి పోయిన రేవంత్‌రెడ్డి రైతుల ఎరువుల కొరత తీర్చలేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నట్లు రేవంత్‌రెడ్డికి తిట్లు ఎక్కువ పని తక్కువ అని ఎద్దేవ చేశారు. యూరియా కోసం రైతులు రోడ్డెక్కి ధర్నా చేసే దుస్థితి కల్పించారని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై బాసు హనుమంతు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

శ్రీరంగాపూర్, ఆగస్టు 20 ప్రభాతవార్త : వనపర్తి జిల్లా పరిధిలోని శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్ "వార్షిక తనిఖీలలో" భాగంగా వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ బుధవారం రోజు సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా పోలీసుల గౌరవ వందన్న స్వీకరించి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్లో రికార్డులు, పరిసరాలను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారేకు, టెక్నికల్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి. పెండింగ్లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను శ్రీరంగాపూర్ ఎస్ఐ రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వార్డుకు పోలీస్ అధికారిని కేటాయించి వీపీఓ విధానాన్ని పక్కాగా అమలు చేస్తూ గ్రామాలకు సంబంధించిన వీపీఓలు రోజు గ్రామాలను సందర్శించి అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని గ్రామాలలో ప్రజలతో స్నేహపూర్వకమైన సంబంధాలు కొనసాగించాలి.ముఖ్యంగా ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా గస్తి నిర్వహించాలన్నారు. పోలీస్‌స్టేషన్లో ఉన్న బ్లూ కోర్టు స్టేషన్ రైటర్స్ సెక్షన్ ఇంచార్జ్ పెట్రోల్ కార్ రిసెప్షన్ లాంటి వర్టికల్స్ కచ్చితంగా అమలుచేయాలని సూచించారు. శ్రీరంగాపూర్ మండలంలో గంజాయి, మట్కా, పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలి అన్నారు. రాత్రి సమయాలలో మరింత పటిష్టంగా గస్తీ పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరాల అదుపునకు కృషి చేయాలన్నారు. సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికట్టాలన్నారు. ముఖ్యంగా కేసుల దర్యాప్తునందు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సరైన సమయంలో దర్యాప్తు చేసి కోర్టుల నందు చాట్చిటు దాఖలు చేసినప్పుడు బాధితులకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు,కొత్తకోట ఇన్చార్జి సిఐ నరేష్, శ్రీరంగాపూర్ ఎస్సై రామకృష్ణ,పెబ్బేరు ఎస్ఐ యుగంధర్‌రెడ్డి,డిసిఆర్‌బి ఎస్ఐ తిరుపతిరెడ్డి,పెబ్బేరు రెండో ఎస్సై దివ్య,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుందాం

ఖిల్లా ఘనపురం ఆగస్టు 20, ప్రభాతవార్త: స్థానికసస్థలఎన్నికలలో బీజేపీ ఆభర్థులను గెలుపుంచుకుని సత్తా చాటుదామని రాష్ట్ర బిజెపి కోశాధికారి బండారు శాంతా కుమార్ అన్నారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్ లో వెంకటం పల్లి గ్రామానికి చెందిన పలువురు చిలుక చెన్నయ్య ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో జాయిన్ అయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాంతా కుమారు మాట్లాడుతూ, రాబోయే కాలంలో తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందని కార్యకర్తలు ఎవరు నిరుత్సాహపడకుండా పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో చేపడుతున్న సిసి రోడ్లు ఉపాధి హామీ పథకం పనులు, రేషన్ కార్డు ద్వారా పంపిణీ చేసే సన్న బియ్యం కూడా కేంద్ర ప్రభుత్వం నిధులతో పంపిణీ చేస్తున్నారని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం అధికార కాంగ్రెస్ పార్టీకి లేదని కావాలని బీసీ రిజర్వేషన్లపై రాద్ధాంతం చేసి స్థానిక ఎన్నికలను వాయిదా వేస్తుందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు మైనార్టీలకు 10 శాతం రిజర్వేషన్లు మతం ప్రాతిపదికన చేర్చాలని దీంతో బీసీలకు అన్యాయం జరుగుతోందని దీని కోసమే బిజెపి బిసి బిల్లుకు మద్దతు ఇవ్వడం లేదన్నారు. మైనార్టీలలో తొలగించి బిల్లును ప్రవేశపెడితే కచ్చితంగా బిజెపి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇస్తుందని చెప్పారు. అనంతరం మండల కేంద్రంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన వారికి కేటాయించాలని అర్హులైన బీసీ లందరికీ ప్లాట్లు మంజూరు చేయాలని ఘనపసముద్రం ముంపులో మునుగుబాటుకు గురైన 600 ఎకరాలకు సంబంధించిన రైతులకు ఎకరాకు 25 లక్షల చొప్పున నష్టపరిహారం తక్షణమే అందజేయాలని పలు డిమాండ్లతో కూడిన సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు నిర్వహించి అనంతరం స్థానిక తహసిల్దార్ సుగుణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు డి నారాయణ, జిల్లా తాజా మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, మెంటే పల్లి పురుషోత్తం, మండల పార్టీ అధ్యక్షులు బుచ్చిబాబు గౌడ్, మండల ఇన్చార్జి సీతారాముడు, విక్రమ్ ఆశన్న గోవర్ధన్ పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

శాంతా కుమార్ ఆధ్వర్యంలో బిజెపిలో కలుస్తున్న పలువురు నాయకులు

మామిళ్ళపల్లి , దాసర్లపల్లి గ్రామాల రాకపోకలు నిలిపివేత

ఉప్పునుంతల,ఆగస్టు 20 ప్రభాతవార్త : గత కొన్ని రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలకు మండలంలో వాగువంకలు పొంగి,పొర్లుతుండడంతో ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు మార్గాల గుండా ఉన్న ప్రమాద జోన్‌ల వద్ద పోలీసుల పహరా ఏర్పాటుచేశారు.మామిళ్ళపల్లి నుంచి దాసర్లపల్లి వెళ్లే మార్గంలో చీకటి వాగులో వరదఉధృతి అధికంగా పెరగడంతో బుధవారం పోలీస్ పహారా ఏర్పాటుచేశారు.చీకటి వాగు ఎగువప్రాంతం నుంచి అధికంగా వరద పెరగడంతో ప్రాణ నష్టాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయని ఎస్సై సమక్షంలో పహారా ఏర్పాటు చేశారు. గత వారం క్రితం అచ్చంపేట డివిజన్ పోలీస్ అధికారి పల్లె శ్రీనివాసులు ఈ ప్రాంతాన్ని సందర్శించడం జరిగిందని, అప్పటి నుంచి వరద ఉధృతి తగ్గకుండా రోజు రోజుకు పెరుగుతుండడంతో ప్రమాదాలు జరగ కుండా ముందు జాగ్రత్త చర్యగా బుధవారం పోలీస్ పహారా ఏర్పాటు చేసి రాకపోకలు తాత్కాలికంగా నిలిపి వేశారు. అదేవిధంగా మొల్గర సమీపంలో ప్రవహిస్తున్న దుందుభి వాగు ఉధృతి అధికంగా ఉండడంతో ఎస్సై వెంకట్ రెడ్డి ఆ ప్రాంతంలో ఎవరు చేపలు పట్టడానికి కానీ, వాగులో దిగే ప్రయత్నం చేయకూడదని అవగాహన కల్పించారు.

పహరా కాస్తున్న పోలీసులు

ఇండియా కూటమికి బీసీ అభ్యర్థి కనబడలేదా..?

బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మోడల శ్రీనివాస్ సాగర్

మహబూబ్‌నగర్, ఆగస్టు 20, ప్రభాతవార్త: భారతదేశ రెండో అత్యున్నత ఉపరాష్ట్రపతి పదవికి దేశంలో బీసీలు అర్హులు కారా.. ఇండియా కూటమికి గానీ కాంగ్రెస్ పార్టీకి గానీ బీసీలు కనబడలేదా అని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మోడల శ్రీనివాస్ సాగర్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. భారతదేశ స్వాతంత్ర్యానంతరం ఇంతవరకు ఒక బీసీ బిడ్డ ఉపరాష్ట్ర పదవికి నోచుకోలేదు. ఈసారి ఎన్డీఏ ప్రభుత్వం ఒక బీసీ బిడ్డ రాధాకృష్ణన్ కు అవకాశం కల్పిస్తే కాంగ్రెస్ పార్టీ మాత్రం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ప్రకటించడం బీసీల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయడమే అని అన్నారు. దేశంలో 60 శాతం పైగా ఉన్న బీసీలు ఇండియా కూటమికి కనబడలేదా అని ప్రశ్నించారు.

రైతులకు సరిపడా యూరియా అందించాలి

వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

బిజినేపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త : ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందించకుండా అనేక ఆంక్షలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ అన్నారు.బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రెండు ఎకరాల పైన ఎంత భూమి ఉన్నా కేవలం రెండు బస్తాల యూరియా మాత్రమే ఇస్తున్నారని యూరియాతోపాటు నానో లిక్విడ్ కచ్చితంగా కొనాలని షరతులు పెడుతూ రైతులను ఇబ్బందిపాలు చేస్తున్నారని ఆరోపించారు. రెండెకరాలకు తక్కువగా ఉన్న రైతులకు యూరియా అందించడం లేదని దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యూరియ, నానో లిక్విడ్ కు సబ్సిడీ ద్వారా 900 రూపాయలు అయితే బయట కేవలం ఒక బస్తా యూరియాకు రూ. 1500లు తీసుకుంటున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం యూరియా కొరత చూపించడంతో బ్లాక్ మార్కెట్లో విపరీతంగా ధరలు పెంచి అమ్ముతున్నారని , ఇలాంటి పరిస్థితులలో వ్యవసాయం చేయడం కూడా రైతులకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్ మార్కెట్లో యూరియాను అధిక ధరలకు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు చంద్రశేఖర్ సంతోష్ బాల పేరు రాములు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లు సియంఆర్ ధాన్యాన్ని వెంటనే డెలివరీ చేయాలి

మిల్లర్లకు ఆదేశాలు జారీ చేస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ

గద్వాల టౌన్ ఆగస్టు 20, ప్రభాతవార్త: సి.యం.ఆర్. ధాన్యాన్ని వెంటనే డెలివరీ అయ్యేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ మిల్లర్లకు ఆదేశించారు. బుధవారం ఐడిఓసిలోని తమ చాంబర్‌లో ఖరీఫ్ 202425 ధాన్యం డెలివరీపై పాల్గొన్న 37 రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రైస్ మిల్లులో నిలువ ఉన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లింగ్ చేసి సరఫరా చేయాలని మిల్లర్లకు ఆదేశించారు. ఖరీఫ్ 202425 ధాన్యం గడువు 12092025 వరకు పొడిగించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 37 మిల్లుల్లో నిల్వగా ఉన్న 65,366 టన్నులలో ఇప్పటికే 38,251 టన్నులు బియ్యాన్ని డెలివరీ చేయడం జరిగిందని తెలిపారు. మిగతా సన్న బియ్యాన్ని నిర్దేశిత గడువులోపు డెలివరీ చేయాలని సూచించారు. సిఎంఆర్ రైస్ సమయానికి సరఫరా చేయడం ద్వారా పేదలకు ప్రభుత్వ పథకాల ద్వారా అందించే ఆహార భద్రతలో ఎటువంటి అంతరాయం కలగకుండా ఉంటుందని ఆయన అన్నారు. సన్న బియ్యాన్ని సమర్థవంతంగా డెలివరీ చేయాలని సూచించారు. ప్రతి రైస్ మిల్లులో నిలువ ఉంచిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఎస్ఓ స్వామి కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విమల, మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కంపౌండ్‌లో నీరు ఇలా.. లోపలికి పోయేది ఎలా..?

పెబ్బేరు,ఆగస్టు 20 ప్రభాతవార్త : పెబ్బేర్ పట్టణ కేంద్రంలో నేషనల్ హైవే రోడ్డు పక్కన ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్, కాలేజ్ లో కాంపౌండ్, క్రీడా ప్రాంగణంలో వర్షాకాలం వస్తే చాలు కంపౌండ్ మొత్తం నీళ్లే. పట్టించుకునే అధికారులే లేరు విద్యార్థులపై పర్యవేక్షణ ఏది? అంటూ పలువురు విద్యార్థుల

జర్నలిస్టు వృత్తి విలువలతో కూడినది

◆ టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్

ఊట్కూర్, ఆగస్టు 20 ప్రభాతవార్త: ఊట్కూర్ మండల కేంద్రంలో బుధవారం టీయూడబ్ల్యూజే మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిజం దేశంలో నాల్గవ స్థంభంగా గుర్తింపు పొందింది. ఆ విలువలను కాపాడే బాధ్యత ప్రతి జర్నలిస్టుపై ఉంది" అని పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి టీయూడబ్ల్యూజే కట్టుబడి ఉందన్నారు. అలాగే జర్నలిస్టుల కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ నెలలో కార్పొరేట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల్లో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు శిక్షణతరగతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు సమాజంలో అవినీతి, అక్రమాలను వెలికితీయాలి. జర్నలిస్టులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా సంఘం అండగా నిలుస్తుంది" అని మధు గౌడ్ స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా నాయకులు రాజేష్, సంజీవ్ ప్రకాష్, నక్క శ్రీనివాస్, ఎల్లారెడ్డి, విఠోబా, సురేష్, కోరం శంకర్ తదితరులు పాల్గొన్నారు. మండల కమిటీ నాయకులు అశోక్, ప్రతాప్‌రెడ్డి, భానుచందర్, బ్రహ్మానందరాజు, వసంత్, రవి, శ్రీనివాస్‌మొదలైన వారు హాజరయ్యారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు : ఎస్పీ అబ్దుల్ ఖాదర్

జడ్చర్ల, ఆగస్టు20 ప్రభాతవార్త: జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు జడ్చర్లలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రజాభద్రత-పోలీసు బాధ్యత" కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా జడ్చర్ల ఎస్పీ అబ్దుల్ ఖాదర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సురక్ష పోలీసు కళాబృందం పాటలతో పాటు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, షీ టీమ్ సభ్యులు వివిధ సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన, నేరాల నివారణ, సమాజంలో ఐక్యత ప్రాముఖ్యత వివరించారు. మహిళలు, బాలికలపై వేధింపులకు కఠిన శిక్షలు ఉన్నాయని, చిన్న వయసులో తప్పుఆకర్షణలకు లోనుకాకుండా భవిష్యత్తు పాడుచేసుకోవద్దని సూచించారు. షీ టీమ్ మరియు భరోసా, సఖీ సెంటర్లు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని హామీ ఇచ్చారు. అలాగే సైబర్‌మోసాలకు లొంగకూడదని, మోసపోతే హెల్ప్‌లైన్ 1930ను సంప్రదించాలన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మహబూబ్‌నగర్ జిల్లాను నేర రహితంగా మార్చే సంకల్పాన్ని నెరవేర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ అబ్దుల్‌ఖాదర్ సిబ్బంది, కళాశాలఅధ్యాపకులు, విద్యార్థులు, సురక్ష కళాబృందం సభ్యులు, మానవ అక్రమ రవాణా విభాగం సభ్యులు, షీ టీమ్ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల కూపన్ల పంపిణీ

మద్దూర్, ఆగస్టు20 ప్రభాతవార్త: నారాయణపేట జిల్లా మద్దూర్ పట్టణ కేంద్రంలో బుధవారం రేషన్ కార్డుల కూపన్లను తహసిల్దార్ మహేష్ కుమార్‌గౌడ్, సింగిల్ విండోచైర్మన్ నరసింహ పంపిణీ చేశారు. మండలానికి మొత్తం కూపన్లు 1598 మంజూరు అయ్యాయి. 3,000కు పైగా కొత్త పేర్లునమోదు చేయడం జరిగిందని తహసిల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ నరసింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుపేదలకు రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్దిభీములు, మాజీజెడ్పిటిసి రఘుపతిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

జానంపేట గ్రామ నివాసికి డాక్టరేట్ డిగ్రీ

శ్రీరంగాపూర్, ఆగస్టు20 ప్రభాతవార్త : శ్రీరంగాపూర్ మండల పరిధిలోని జానంపేట గ్రామ నివాసి అయిన యు. శంకర్ ఇటీవల2024 సంవత్సరము చివర్లో పిహెచ్‌డిని ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేయగా 19.08.2025 నాడు ఉస్మానియా యూనివర్సిటీ 84వ వార్షికోత్సవం కార్యక్రమంలో పీహెచ్‌డి డిగ్రీని ఇస్రో చైర్మన్ వి నారాయణ, యూనివర్సిటీ ఉపకులపతి రాములు, మొలుగారం, కలిసి అందజేశారు. యు.శంకర్ మాట్లాడుతూ పిహెచ్డి డిగ్రీని అందుకోవడం ద్వారా జీవితంలో ఒక మైలురాయిని చేరుకోవడంగా భావిస్తున్నట్టు, నా చదువులకు చిన్నప్పటినుంచి ఎంతో కష్టాలను అనుభవించి సహకరించిన తల్లిదండ్రులకు, గురువులకు, మిత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. శంకర్ ప్రస్తుతం పానగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. తోటి అధ్యాపకునికి పీహెచ్‌డి డిగ్రీ రావడంతో కళాశాల ప్రిన్సిపల్, సహచర అధ్యాపకులు, ఉద్యోగులు, స్నేహితులు గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

వనమహోత్సవం

భూత్పూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త: భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పదోవార్డులో మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ ఆధ్వర్యంలో వనమ హోత్సవం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వార్డు ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి లిక్కి విజయ్ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఎండి ఖదీర్, ఎండి ఆహ్మద్, ఎండి హసన్ పాల్గొన్నారు.

మహిళలకు 'భరోసా' కీలకం

- లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారి ఇందిర

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు20, ప్రభాతవార్తః మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో భరోసా కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారి ఇందిర ముఖ్య అతిథిగా హాజరై, అందరితో సంభాషిస్తూ భరోసా సెంటర్ల ప్రాధాన్యత, మహిళా, బాలల రక్షణలో సమన్వయం అవసరాన్ని వివరించారు. మొదటగా సమావేశంలో పాల్గొన్న స్టేక్ హోల్డర్లు తమ తమ విధి విధానాలు, అనుభవాలు, సమస్యల పరిష్కార మార్గాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ భరోసా సెంటర్లు మహిళలు, చిన్నారులు, వృద్ధులు వంటి బలహీన వర్గాల రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సమాజంలో జరిగే హింసాత్మక ఘటనల నివారణ, బాధితులకు న్యాయం అందించడంలో పోలీసుశాఖ, లీగల్ సర్వీసెస్ అథారిటీ, మహిళా శిశు సంక్షేమ విభాగాలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి కేసు పరిష్కారంలో మానవతా దృక్పథం అత్యంత ముఖ్యమని, బాధితులు భయపడకుండా ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాల్సిన అవసరముందని అన్నారు. చిన్నారులపై నేరాలు, మహిళలపై వేధింపులు, గృహ హింస వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు చట్టపరమైన సహాయం, కౌన్సిలింగ్, మరియు పునరావాసం ఒకే వేదికపై అందించబడితే సమాజం మరింత బలపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ జరీనా, డీఎంహెచ్‌వో కృష్ణ, అదనపు ఎస్పీ బి.ఎన్.రత్నం, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఎస్పీ శ్రీధర్ (భరోసా), డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, సీడబ్ల్యూసీ నయీ ముద్దీన్, డీసీపీయూరాములు, పీసీఎస్‌వో కోర్టు జాన్, వుమెన్ సేఫ్టీ వింగ్ రేంజ్ మేనేజర్ జోసెఫ్, జిల్లా ఇన్స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సుధా మాధురి, సఖి సెంటర్ అడ్మిన్ సౌజన్య, చైల్డ్ లైన్ సెంటర్ శివకుమార్, భరోసా ఇంచార్జ్ ఉమెన్ ఎస్సై సుజాత, ఐటీ కోర్ టీం ఇన్‌ఛార్జ్ రాఘవేందర్ సహా భరోసా సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

బిల్లులిస్తారు. .స్కాలర్‌షిప్‌లు ఇవ్వరా..?

- బి.సి విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ

జడ్చర్ల ఆగస్టు 20 ప్రభాతవార్త : బడా కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించడానికి చొరవ తీసుకుంటున్న ప్రభుత్వం పేద విద్యార్థుల స్కాలర్షిప్ల విషయంలో మాత్రం ఎందుకు చెల్లించడం లేదని బి.సి విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ ప్రభుత్వంపై మండిపడ్డారు. 16లక్షల75వేలమంది విద్యార్థుల ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జడ్చర్లలో బుధవారం 'మహా ర్యాలీ" నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చెప్పిన అధికారులు వినట్లేదని, నిరక్ష్యం వహిస్తున్నారనీ ఆవేదన వ్యక్తంచేశారు. నిధుల విడుదలకు అడ్డుకట్ట వేస్తుండడం వలన నిరుపేదల చదువు గాలిలో దీపంల మారిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి స్కాలర్‌షిప్‌లకు కూడా బిల్లులు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యనేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి, ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు తప్పవని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర బి.సి విద్యార్థి సంఘం అధ్యక్షులు వేములరాధాకృష్ణ, మండలఅధ్యక్షుడు ,రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట యాదవ్, మండల కార్యదర్శి రఘు, మండల ప్రచార కార్యదర్శి రాము, కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విజయ్ నర్సింలు, తెలంగాణ రాష్ట్ర జూనియర్ లాయర్ సంఘం అధ్యక్షులు వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సద్గురు ధీరానందనాథ స్వాముల ఆరాధనోత్సవం

నారాయణ పేట, ఆగస్టు 20 ప్రభాతవార్త: నారాయణపేట పట్టణంలోని దేవిజీ నిలయంలో బుధవారం సద్గురు ధీరానందనాథ స్వాముల వారి ఆరాధనోత్సవాలు వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య ఘనంగా జరిగాయి. ఆరాధనోత్సవాల్లో భాగంగా మహాగణపతి తీర్థ రాజ పూజ, బ్రాహ్మణ పాదపూజ గురుమండల పూజతోపాటు అంతకు ముందు సద్గురువుల సమాధికి విశేష అభిషేకం అర్చనాది కార్యక్రమాలతో పాటు అలంకరణ సేవా మహా మంగళహారతి, అన్నదానం నిర్వహించారు. ప్రముఖ కృష్ణయాజుర్వేద స్మార్థ పండితులు బ్రహ్మశ్రీ ఉట్కూర్ విభవాసు పురోహిత్ అగ్నిహోత్రి ఆచార్యత్వం కొనసాగాయి. ఈ కార్యక్రమంలో మహేష్ దేవ్ జి, ధీరనంద్ దేవ్, జి. వెంకుశాస్త్రి, ధరణిధర్‌దీక్షిత్, రాజశేఖర్ పూజారి, రామ్మోహన్‌రావ్, కులకర్ణి గోపాల్ చారి, సురేష్ రావు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులతో గ్రామ రూపురేఖలు మారాలి

◆ అత్యంత వేగంగా నిర్మాణ పనులను పూర్తి చేయాలి
◆ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
◆ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి కొనసాగాలి
◆ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 20 ప్రభాతవార్త: అభివృద్ధి పనుల ద్వారా గ్రామ రూపురేఖలు మారాలన్నదే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు. గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. బుధవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని విడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, తహసిల్దార్, ఇంజనీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధిలో నాణ్యతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రతి పని ప్రమాణాలకు అనుగుణంగా జరగాలని, ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు నిర్వహించబడాలని, గ్రామ ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎలాంటి తేడా ఉండకూడదని, ప్రతి పని ప్రామాణికంగా ఉండేలా చూడాలన్నారు. గ్రామాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడానికి అన్ని శాఖలు సమన్వయంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా రోడ్లు, నీటి పారుదల, విద్యుత్, ఆరోగ్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సోలార్ విద్యుదీకరణ, మిషన్ భగీరథ వంటి రంగాల్లో వారిగా పురోగతి పనులు నాణ్యత ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చెయ్యాలని సంబంధిత శాఖల అధికారులుకలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఈఈ కె. విజయ్‌కుమార్, డిఇఓ రమేష్ కుమార్, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్, ఆర్‌అండ్‌బి, విద్యుత్ డిఈ, డైరీ, ఉపాధి కల్పన, వివిధ శాఖల అధికారులు, వంగూర్ ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

చర్ల తిరుమలాపూర్ రోడ్డుపై వరద నీటిని పరిశీలించిన కలెక్టర్

చర్ల తిరుమలాపూర్ వద్ద వరద నీటిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 20 ప్రభాతవార్త: నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని చర్ల తిరుమలాపూర్ రోడ్డుపై నిలిచిన వరద నీటిని నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా ఉయ్యాలవాడ నుండి చర్ల తిరుమలాపూర్ వెళ్లే రోడ్డు మీదకు వరద నీరు చేరడంతో గ్రామానికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయని పలువురు గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు, సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వర్షాల కారణంగా రవాణా వ్యవస్థకు ఇబ్బందులు కలగకుండా వెంటనేమరమ్మత్తు చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లాలో కురిసిన భారీ వర్షానికి నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని చర్ల తిరుమలాపూర్ వెళ్లే రహదారి పైన ఉన్న లోలెవెల్ వంతెనకు ఇరువైపులా కోతకు గురైన రహదారిని పరిశీలించి పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే మరమ్మత్తు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇటీవల జిల్లాలో భారీ వర్షం కురిసినందున వాగులు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ఎవరు దాటే ప్రయత్నం చేయకూడదని, అత్యవసరమైతేనే బయటకు రావాలని తెలిపారు. వ్యవసాయదారులు చేనులలో, విద్యార్థులు ముంపుకు గురైన ప్రదేశానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జన జీవనానికి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో వాగులు, కాజ్‌వేల వద్ద పోలీస్, రెవెన్యూ, పంచాయితీరాజ్ సిబ్బం దితో సహాయం ఏర్పాటుచేసి అటువైపుగా ఎవరువెళ్లకుండాచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల వారిని రక్షించడానికిఎస్.డిఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని, శిథిలావస్థలో ఉన్న భవనాలలో ఉన్న వారిని గుర్తించి వారికి పునరావాసంఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. వరదప్రభావం ఉన్న ప్రాంతాలను గుర్తించి కావలసినజాగ్రత్తలు, స్థానిక యంత్రాంగం తీసుకో వాలని లైఫ్‌జాకెట్లు ఇతరసదుపాయాలన్నీ సిద్ధంగా ఉంచుకో వాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చినఫిర్యాదులకు సంబంధించి వెంటనే స్పందించి సంబంధిత సిబ్బందికి సమాచారం అందజేసి పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకుసూచించారు. జిల్లాకలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి విజయ్, నాగర్ కర్నూల్ ఆర్డీవో సురేష్‌బాబు, ఇతరశాఖల అధికారులు, గ్రామ ప్రజలు ఉన్నారు.

వేములలో గ్రామీణ భాగ్యస్వామ్య మూల్యాంకణం ప్రదర్శన

ముసాపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త : మండలంలోని వేముల గ్రామంలో గ్రామీణ వ్యవసాయ పని అనుభవం కార్యక్రమంలో భాగంగా మహాత్మా జ్యోతి బాపు పూలే అగ్రికల్చర్ కళాశాల నుండి వచ్చినటువంటి విద్యార్థినీలు బుధవారం వేముల గ్రామంలో గత 2నెలల నుంచి గ్రామంలో రైతులు పొలాల్లో ఏఏ పంటలు వేస్తారో చూసి వారికీ తగిన సూచనలు మరియు ఏ కాలంలో ఏ పంట వేస్తే ఎక్కువ దిగుబడి వస్తోందో తెలియ జేస్తూ, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఎలా వస్తాయో పంటల గురించి కూడా రైతులకు తెలియజేశారు (పిఆర్ఎ)గ్రామీణ బాగాస్వామ్య మూల్యాంకణం (ఎంజెపి) మహాత్మా జ్యోతి బాపూలే అగ్రికల్చర్ కళాశాల వనపర్తి విద్యార్థినీలు ప్రైస్లీన్, గౌతమి, యుక్తంజలి, స్వాతి, వర్షణి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేముల గ్రామ రైతులు మరియు పంచాయితీ కార్యదర్శి సతీష్ రెడ్డి, వేముల అగ్రికల్చర్ ఏఈఓ శేషిత, జానంపేట ఏఈఓ సురేష్, రవీందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, గ్రామ రైతులు పాల్గొని ఈ కార్యక్రమన్ని విజయవంతం చేసారు.

ఉత్సాహంగా తీజ్ వేడుకలు

జడ్చర్ల, ఆగస్టు20 ప్రభాతవార్త: మండలంలోని కోడుగల్ గ్రామంలో తీజ్ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఫ్లీజ్ పండుగ సందర్భంగా గ్రామంలోని టీజీటీ డబ్లుయుఆర్‌జె సి బాలికల విద్యాలయంలో యువతులు పెద్ద ఎత్తున తీజ్ వేడుకల్లో పాల్గొన్నారు. తీజ్ నిమజ్జనం కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు.

విద్యార్థులకు అభినందనలు

నారాయణపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త: ఎస్ఎఫ్ అండర్ 15 విభాగంలో ఈనెల 18,19 తేదీల్లో గురుకుల విద్యాపీట్ ఇబ్రహీంబాద్ రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో నారాయణపేట బాలికలజట్టు మూడో స్థానం సాధించడం జరిగింది. క్రీడాకారులను డీఈవో అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్జిఎఫ్ సెక్రటరీ నరసింహులు, శ్రీనివాస్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది ఉదయభాను, సాయినాథ్, రవికుమార్, నరసింహ, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు జగదీష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పోస్టర్ విడుదల

ధన్వాడ, ఆగస్టు20 ప్రభాతవార్త: ధన్వాడ మండలంలోని పాతపల్లి గ్రామంలో ఆఖిల భారత ఐక్య రైతు కూలి సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. రైతు కూలి సంఘం జిల్లా నాయకులు సలీమ్ మాట్లాడుతు ఈ నెల 25వ తేదిన జరిగే ఆఖిల భారత ఐక్య రైతుసంఘం ఆధ్వర్యంలో మహబుబ్ నగర్‌లో జరిగే రాష్ట్ర ప్రథమ మహాసభకు ఐదు వేల మందితో విజయవంతం చేయలని, అందులో భాగంగా పాతపల్లి నుండి 300 మంది పోవాల్సి ఉంటుంది. కబటీ గ్రామం నుండి రైతులు, మహిళలు, యువకులు భారిగా తరలి రావల్సిందిగా కోరుతున్నాను అన్నారు. నేటి వాతావరణం వల్ల రైతులు భారిగా నష్టపోతున్నారని ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని అందుకు ధన్వాడ మండలంలో తహసిల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా చేపట్టాల్సి ఉంటుందని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం గ్రామ అధ్యక్షులు పీకే రాములు, రైతు సంఘం సభ్యులు జి. కృష్ణయ్య, టేరప్ప, వై.రాజు, బీరప్ప, తిమ్మప్ప, రైతులు యువకులు పాల్గొన్నారు.

22న బందుకు వ్యాపారస్తులు సహకరించాలి

మద్దూర్, ఆగస్టు 20 ప్రభాతవార్త : నారాయణపేట జిల్లా మద్దూరు పట్టణ కేంద్రంలో ఈనెల 22వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా బందుకు ఓయు జెఎసి నిర్ణయించినందుకు మద్దూర్‌లో కూడా బందుకు సహకరించాలని మద్దూర్ వ్యాపార సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. మార్వాడి వారు గో బ్యాక్ అంటూ చేస్తున్న బందుకు ప్రతి ఒక్కరు సహకరించి విజయవంతం చేయాలని పలు వ్యాపార సంఘాలు నాయకులు కోరారు.

హర్ ఘర్ తిరంగా సైకిల్ ర్యాలీ

మక్తల్ టౌన్, ఆగస్టు20 ప్రభాతవార్త: మక్తల్ బాలుర పాఠశాల అధ్వర్యంలో "హర్ ఘర్ తిరంగా" అంటూ సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఎన్‌సిసి క్యాడెట్స్ జాతీయ సమైక్యతకు సంబంధించిన నినాదాలు చేస్తూ, పుర వీధుల గుండా సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి కేర్ టేకింగ్ ఆఫీసర్ లక్ష్మణ్ మాట్లాడుతూ చిన్నతనం నుండే జాతీయ భావాలను పెంపొందించుకోవాలని ఎంతో మంది త్యాగఫలమే మన దేశ స్వాతంత్రం కావునా దేశం పట్ల ప్రతీ పౌరుడు భాధ్యతను కలిగి ఉండాలన్నారు. మహనీయుల త్యాగాలను మరవొద్దు. కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా దేశ పౌరులందరూ సోదర భావాన్ని కలిగిఉండాలన్నారు. ప్రపంచంలో చాలా దేశాలలో లేనటువంటి ఉత్తమ, విశిష్ట లక్షణాలను మన దేశం కలిగియున్నది. అలాంటి గొప్ప దేశం సమగ్రతను కాపాడే కర్తవ్యం మనందరిపై ఉన్నదని లక్ష్మణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి క్యాడెట్స్ పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు ఎమ్మెల్యే చేతులు మీదుగా చెక్కులు పంపిణీ

నారాయణపేట, ఆగస్టు20 ప్రభాతవార్త: నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎమ్మెల్యే డా. పర్ణిక రెడ్డి చేతుల మీదుగా బుధవారం దామరగిద్ద మండలం బాపన్ పల్లి, దామరగిద్ద తండా వాసులకు ఆర్డిఓ కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జన్మదినం సందర్భంగా రైతులకు చెక్కులు ఇవ్వడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. మిగతా రైతులు కూడా ముందుకు వచ్చి ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రితో మాట్లాడి పరిహారం పెంచేలాకృషి చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో నష్టపరిహారం పెంచితే అందరికీ అందిస్తామని అన్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మండలాల నాయకులు ఉన్నారు.

గణేష్ మండప నిర్వహకులు సూచనలు పాటించాలి : ఎస్ఐ కురుమూర్తి

వెల్దండ, ఆగస్టు 20 ప్రభాతవార్త: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ప్రతిష్టించి వినాయక విగ్రహాల యొక్క పూర్తి వివరాలు మండప నిర్వహకులు విధిగా విగ్రహ ప్రతిష్టకు ఒకరోజు ముందుగానే తెలంగాణ పోలీస్ యొక్క వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండపాలను ఏర్పాటు చేసే సమయంలో మండప నిర్వహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా, మండపాలను రోడ్డు పక్కకు వేయాలని, మండపాలను విద్యుత్ వైర్లకు దూరంగా వేసుకోవాలని, కరెంటు ఇతర అవసరాల కొరకు సంబంధిత శాఖల నుండి అనుమతులు పొందాలన్నారు. మండపాల వద్ద తాత్కాలికంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని డీజేలు నిషేధమన్నారు. నిర్వాహకులు తప్పకుండా సూచనలు పాటించి సహకరించాలని కోరారు.

వెంకటాయపల్లి శ్రీరంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు

దేవరకద్ర, ఆగస్టు 20 ప్రభాతవార్త: దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామంలోని ఊరగుట్టపై ఉన్న శ్రీ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుండి శనివారం వరకు మూడు రోజులపాటు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు వచ

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి భాగం..

పెంచేలా నిర్వాహకులు వ్యాపారం కొనసాగించాలనిఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.ఈ కార్యక్రమం లో హకా రైతు సేవా కేంద్రాల నిర్వహకులు ఆలంపల్లిలక్ష్మయ్య, కన్యయ్యాశెట్టి, అనిల్ కుమార్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, అగ్రికల్చర్ ఏవో రాజేందర్ అగర్వాల్,టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండలఅధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి, దేవరకద్ర మండ ల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, మాజీ జెడ్పిటిసి లక్షీ ష్మకాంత్ రెడ్డి, కురుమూర్తి చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి, చంద్రమౌళి, గోవర్ధన్ రెడ్డి, ఫారుక్ అలీ, కౌకుంట్లనాగయ్య శెట్టి,ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ట్యాంక్ అందజేత

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 20 ప్రభాతవార్త: నాగర్‌కర్నూల్ క్లబ్ సీనియర్ సభ్యులు, క్లబ్ అభివృద్ధికి, లయన్స్ డిస్ట్రిక్ట్ అభివృద్ధికి నిరంతరం సహకరించే మాజీ గవర్నర్ రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థుల తాగునీటి సౌకర్యం కొరకు 1000 లీటర్ల వాటర్ ట్యాంక్‌ను ముఖ్య అతిథి జోన్ చైర్ పర్సన్ రాధా రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిస్ట్రిక్ట్‌కి సలహాదారులుగా ఉన్న మాజీ గవర్నర్ ల పుట్టినరోజులను డిస్ట్రిక్ట్‌లోని అన్ని క్లబ్స్ ఏదో ఒక సేవాకార్యక్రమం నిర్వహించి, సేవలతో కూడిన శుభాకాంక్షలు అందించాలని డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్ రెడ్డి కోరిక మేరకు నాగర్ కర్నూల్ క్లబ్ ద్వారా మంచి సేవా కార్యక్రమం నిర్వహించిన నాగర్‌కర్నూల్ క్లబ్స్ కార్యవర్గాన్ని అభినందించారు. సరస్వతీ శిశుమందిరాలు మన సంప్రదాయాలకు నిలయాలన్నారు. క్లబ్స్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్స్ కి వెన్నెముక అయిన రాధాకృష్ణ పుట్టినరోజును ఒక సేవా కార్యక్రమం ద్వారా నిర్వహించుకోవడం సంతోషంగాఉందని, పాఠశాల అభివృద్ధికి లయన్స్ క్లబ్ కూడా సహకరి స్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న లక్ష్మి, లయన్స్ డిస్ట్రిక్ట్ మెంబెర్ షిప్ కోఆర్డినేటర్ హకీమ్ విశ్వప్రసాద్, కార్యదర్శి సురేష్ కుమార్, కోశాధికారి పరమేశ్వర్ రెడ్డి, క్యాబినేట్ సభ్యులు మాజీ రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను, రాజవర్ధన్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు వెంకటరాజ, పోల శ్రీనివాసులు, లక్ష్మి నరసింహ గౌడ్, రామచంద్రరెడ్డి, ప్రేమ్ కుమార్‌రెడ్డి, సభ్యులు నాగరాణి, అరుణ, సువర్ణలు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలి

నారాయణ పేట, ఆగస్టు 20 ప్రభాతవార్త: ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి, నరసింహ డిమాండ్ చేశారు. తపస్ సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని కోటకొండ, జాజాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపా ధ్యాయులను కలిసి వారు మాట్లాడుతూ సిపిఎస్ ఉత్తర్వులు ఆగస్టు 23వ తేదీన వచ్చినందున ఆ తేదీన కలెక్టర్, తహసిల్దార్లకు వినతిపత్రం సమర్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆ ఉత్తర్వులను దహనం చేస్తున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. పెండింగ్ బిల్లులను చెల్లించాలని, నూతన పిఆర్సి ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కో కన్వీనర్ విజయ,జిల్లా కార్యదర్శి రవికుమార్,లక్ష్మణ్, మండల గౌరవఅధ్యక్షులు శంకర్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి చిన్న నర్సింలు,ప్రధానోపాధ్యాయులు భారతి,శ్రీనివాస్,జయంత్,మండల నాయకులు మధు, శ్రీని వాస్, చిన్నయ్య, తిరుపతిరెడ్డి, శ్రీదేవి,శశికళ, శ్రీనివాస్,నిర్మల, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ లాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలి

■ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

దేవరకద్ర, ఆగస్టు 20 ప్రభాతవార్త: జాతిపిత మహాత్మా గాంధీ లాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకో వాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధు సూదన్‌రెడ్డి అన్నారు. కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామంలో బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ నూతన విగ్రహావిష్కరణ కార్యక్ర మంలో ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య సంఘ సభ్యులు కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డిని స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ స్వాతంత్రం తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి, భారత జాతికి మహాత్మా గాంధీజీ గొప్ప స్ఫూర్తి ప్రదాత అన్నారు. భారత జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం ముచ్చింతల గ్రామానికి తలమానికమని పేర్కొన్నారు. గ్రామంలో గాంధీ విగ్రహం లేని లోటు ఇన్నాళ్లకు తీరిందని అన్నారు. అహింసే ఆయుధంగా స్వాతంత్ర సంగ్రామాన్ని నడిపిన గొప్ప మహానుభావుడు జాతిపిత, మహాత్మా గాంధీ విగ్రహాన్ని ముచ్చింతల గ్రామంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్‌పేర్కొన్నారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ముచ్చింతల విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన బెంచీలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజన పదార్థాల గురించి అడిగి తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసిన దాతలు కల్వ కన్నయ్య శెట్టి, కల్వ రవికుమార్, పాపిశెట్టి వెంకటేశ్వర్లు, యన్మన్ గండ్ల జానకి రాములు, రాజ్ కుమార్, రమేష్, రాఘవ, వేణుగోపాల్, శ్రీనివాస్, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, కురుమూర్తి చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌కథలప్ప, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, శివ కుమార్, ముచ్చింతల వెంకటేశ్వర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళి

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం : జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్, ఆగస్టు 20 ప్రభాతవార్త : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయ మని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన జయంతి సందర్భంగా రాజా పూర్ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానిగా రాజీవ్‌గాంధీ దేశంలో అనేక విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఐటీ, టెలికాం రంగాల పురో గతికి ఎనలేని కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్చర్ల,ఆగస్టు 20, ప్రభాతవార్త: దివంగత ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ మాజీ ఎంపీపీ నిత్యానందం, మాజీ సర్పంచ్ బుక్క వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ బుర్ల వెంకటయ్య, టౌన్ ప్రెసిడెంట్ మీనాజోద్దీన్, తిరుమల్ రెడ్డి, సరఫరాజ్, నరసింహులు యాదవ్, కౌన్సిలర్లు కుమ్మరి రాజు,రమేష్, భాస్కర్‌రెడ్డి, జగదీష్‌చారి, రాంప్రసాద్, తుంగ రఘు, వంశీ కృష్ణ, శాగంటి రఘు, ఖాజాలిముద్దీన్, అనంత పాత్రలో కిషన్, బండ గిరి ప్రసాద్ యాదవ్, జావేద్, అజ్జు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెబ్బేరు, ఆగస్టు20 ప్రభాతవార్త : పెబ్బేరు మండల కేంద్రంలో బుధవారం రోజు టెక్నాలజీ పితామహుడు భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పెబ్బేర్ సుభాష్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, నాయకులు వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, దయాకర్ రెడ్డి, పురు రమణ, యుగంధర్ రెడ్డి, గంధం రాజశేఖర్, నరసింహనాయుడు, రాములు, సర్వేశ్వర్, శివ సాయి, నరసింహ, సీతారాములగౌడ్, జాంగిర్, రణధీర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 20, ప్రభాతవార్త: రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, పలువురు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిలో: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీజయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి మాజీసర్పంచ్ బృంగి ఆనంద కుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ మెంబర్ జిల్లెల్ల రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుస్తకాల రాహుల్, పాండురంగారెడ్డి, షాకేర్, ఏజాస్, గణేష్, రమాకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, రేష్మాబేగం, సుభాని, దున్న సురేష్, తదితరులు ఉన్నారు.

చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే ఉంటాం

■ నారాయణ ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి

నారాయణ పేట, ఆగస్టు20 ప్రభాతవార్త: నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం జిల్లా కేంద్రం లోని అభినందన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ మండలాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఎమ్మెల్యేకు శాలువాలు, పూలమాలతోసన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని మా తాత చిట్టెం నర్సిరెడ్డి, మా తండ్రి చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి ఆశయ సాధనలోనే నేను చివరిశ్వాస వరకు ప్రజాసేవలో ఉంటాను" అన్నారు. గత 18 నెలల్లో కాంగ్రెస్ ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఉపశమనం లభిస్తోందని చెప్పారు. రాబోయే మూడేళ్లలో విద్య, వైద్యం, సాగునీరు సహా అన్ని రంగాల్లో ప్రాంత అభివృద్ధి సాధిస్తామని హామీ ఇచ్చారు. మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి మాట్లా డుతూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం 20ఏళ్లుగా తనతో నడిచిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఈ జిల్లా అభివృద్ధి సాధిస్తాం. భూములు ఇచ్చిన రైతన్నలకు పాదాభివందనం చేస్తున్నాను.వారి నష్టపరిహారం పెంచే దిశగా ఇప్పటికే చర్చలు జరిగాయి" అని పేర్కొన్నారు ఈ కార్య క్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా 30 మంది యువకులు రక్తదానం చేశారు. హిందూ, ముస్లిం,క్రైస్తవ మత పెద్దలు ఎమ్మెల్యేకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేట మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, పట్టణ అధ్యక్షులు ఎండి సలీం, సీనియర్ నాయకులు కోట్లరవీందర్‌రెడ్డి, గందే చంద్రకాంత్, పిఎసిఎస్, ఫిషరీస్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

దామరగిద్ద, ఆగస్టు 20 ప్రభాతవార్త : ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉదయం దామరగిద్ద మండలం క్యాతన్‌పల్లి గ్రామంలో వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్యే, పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం కార్యకర్తలు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మండల కేంద్రంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుబాల్‌రెడ్డి,పుట్టి ఈదప్ప, శ్రీనివాస్, వెంకటరామి రెడ్డి,ఖాజమియా,లక్ష్మణ్,ఆనంద్, వెంకటప్ప,బొంబాయి రాములు, తమ్మల రఘు,నీలి మాణిక్యప్ప, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న నారాయణ ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి

శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

◆ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త: నారాయణపేట జిల్లాలో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి శాంతి సమావేశంలో నిర్వహించారు. ఇందులో భాగంగా జరగబోయే వినాయకచవితి, మిలాద్‌ఉన్‌నబీ పండుగలను శాంతియుతంగా, స్నేహభావంతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. ఈ సందర్భంగా పాల్గొని అధికారు లకు పలు సూచనలు చేశారు.కలెక్టర్, అదనపు కలెక్టర్లు సంచిత్ గాంగ్వర్,శ్రీను, ఆర్డీఓరామచందర్ నాయక్ మాట్లాడుతూ, నిమజ్జన వేడుకలకు సంబంధించి పట్టణాలు, మండలాల్లో ఆర్డీఓలు, డీఎస్పీ లు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్లు చేసి సమస్యల పరిష్కారానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రహ దారుల గుంతలు పూడ్చడం,చెట్ల కొమ్మలు తొలగించడం, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ చర్యలు,మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ, డీజేసౌండ్ సిస్టమ్స్‌పై నిషేధం కఠినంగా అమలవు తుందని హెచ్చరించారు. ఎవరైనా డీజేలను ఉపయోగిస్తే వాటిని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని చెప్పారు. గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ అనుమతి పొందాలని సూచించారు. మండపాల వద్ద ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకోవడం, నాణ్యమైన విద్యుత్ వైర్లను వినియోగించడం, రాత్రి పూట వాలంటీర్లు ఉండేలా చూడాలని సూచించారు. డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ, ఈ ఏడాది జిల్లాలో సుమారు 1500 గణేష్ విగ్రహాలు ప్రతిష్టించబోతున్నారని, రెండు పండుగలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.సమావేశంలో అధికారులు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, విహెచ్‌పీ ప్రతినిధులు పాల్గొని రోడ్ల మరమ్మత్తులు, చెట్ల కొమ్మల తొలగింపు, నిమజ్జనా నికి క్రేన్ల ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు ఈ సమావేశంలో వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

బోధన అభ్యాస సామాగ్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

చిన్నచింతకుంట, ఆగస్టు 20 ప్రభాతవార్త : విద్యాభివృద్ధికి సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి సాధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్.ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి టిఎల్ఎం మేళ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖను గాలికి వదిలేసిందని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దనే ఉంచుకుని, విద్యపై అధిక దృష్టిని కేంద్రీకరించి విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూలు మంజూరు చేశారు. అంతేకాక అడిగిందే తడవుగాపల్లమరి వద్ద ఏటిసి(అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్) కాలేజ్ ను మంజూరు చేశారు. గత పదేళ్ళలో బిఆర్ఎస్ చేయలేనిది 18 నెలల కాలంలో చేసి చూపించామని అన్నారు. విద్యార్థులకు ఆసక్తికరమైన బోధన ఉంటేనే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించగలమని తెలిపారు.ఉపాధ్యాయులు ఒకరితో ఒకరు పోటీ పడుతూ అద్భుతంగా టిఎల్ఎం తయారు చేసుకుని రావడంపై సంతోషం వ్యక్తం చేశారు.చిన్న చింతకుంట మండలం విద్యాభివృద్ధిలో ముందంజలో ఉండేలా ప్రతి ఒక్క ఉపాధ్యాయు లు కృషి చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని 24 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బోధించే తెలుగు,గణితం, పరిసరాల విజ్ఞానం, ఇతర సబ్జెక్టుల నుండి ఒక్కొ క్క దానికి 25 చొప్పున మొత్తం 100 బోధన పరికరాలతో ఏర్పాటు చేసి బోధనాంశాల కోసం బోధనా సామాగ్రిని సుద్ద, కర్రలు, వివిధ పరిసర వినియోగ వస్తువులతో తయారు చేసిన ఆయన సందర్శించారు. ఉత్తమ టిఎల్ఎం ప్రదర్శన చేసిన 10 మంది ఉపాధ్యాయులకు ఎంఈఓ పి. మురళీకృష్ణ ప్రశంస పత్రం అందజే శారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సి.ఆర్.పిలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

నర్వ, ఆగస్టు20 ప్రభాతవార్త: నర్వమండలం లోని రాయికోడ్ గ్రామంలో కొండ రాజశేఖర్‌కు సంబందించిన నిఖిల్ ట్రేడర్స్ ఎరు వుల దుకాణంతో పాటు ఇతర ఎరువుల దుకాణాలను నారాయణ పేట ఏడీఏ జాన్ సుధాకర్, ఏవో అఖిల రెడ్డి బుధవారం తనిఖీ దుకాణాల్లో స్టాక్ రిజిస్ట్రర్లు,బిల్ బుక్కులను పరిశీలించారు. డీలర్లు రసాయనిక ఎరువులను రైతులకు ఎక్కువ రేటుకు విక్రయిస్తే కఠిన చర్యలుతీసుకుంటామని చెప్పారు.రైతులకు అవసరం ఉన్నన్ని రసా యనిక ఎరువులబస్తాలు అందుబాటులో ఉంచి ఇబ్బందులు లేకుం డా చూడాలన్నారు.యూరియాను వరిపైరు సాగుకు ఎక్కువగా ఉప యోగించవద్దని అవసరాన్నిబట్టి పైరు పెరుగుదలకు రైతులు రసా యనికఎరువులను పలుదపాలుగాఉపయోగించాలని సూచించారు.

పిఇటి శారద బాయికి డాక్టరేట్

జడ్చర్ల. ఆగస్టు 20 ప్రభాతవార్త: జడ్చర్ల (కావేరమ్మ పేట) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న శారదాబాయికి ఉస్మానియా యూనివర్సిటీ వ్యాయా మ విద్యలో డాక్టరేట్ అందజేశారు. ఎఫెక్ట్ ఆఫ్ స్విస్ బాల్ అండ్ ఏరోబిక్ ట్రైనింగ్ అమ్మాంగ్ స్కూల్ గర్ల్ అనే అంశంపై పాలమూరు యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంత్ రాథో డ్ గైడ్ ఆధ్వర్యంలో పరిశోధన చేసి డాక్టరేట్ పొందినట్టు ఆమె తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 84వ స్నాతకోత్సవంలోఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణ, ఉస్మా నియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు.డాక్టరేట్ సాధించడం పట్ల జిల్లావ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ నాయకులు, జడ్చర్ల ప్రభుత్వపాఠశాల విద్యార్థులతల్లిదండ్రులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భూత్పూర్,ఆగస్టు 20,ప్రభాతవార్త: బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి బోల్తాపడి ప్రమాదానికి గురై తిమ్మాజిపేట మండలం గుమ్మకొండకు చెందిన యువకుడు మృతి చెందినట్లు భూత్పూర్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.ఎస్సై కథనం ప్రకారం భూత్పూర్ మండలం గుమ్మ కొండకు చెందిన బైరపాగ భాస్కర్(27)) గత రాత్రి 11గంటలకు తన భార్య పుట్టిల్లు తాటికొండకు బయలు దేరాడు.భూత్పూర్ మండలం పోతులమడుగుకుసమీపంలోనిజాతీయ రహదారి-44పై97 హోట ల్‌కు ఎదురుగా బైక్‌అదుపు తప్పితలకు తీవ్రగాయాలతో రక్తస్రావం తో మృతిచెంది పడిఉండడం గమనించినట్లు తెలిపారు. మృతుడి తల్లి బైరపాగ నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ధన్వాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త: ధన్వాడలోని జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో షి టీమ్ పోలీసులు విద్యార్థులకు బుధవారం గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ర్యాగింగ్ ఈవ్ టీజింగ్, చదువుపై శ్రద్ధ, గోల్ సెట్టింగ్, క్రమశిక్షణ, టైం మేనేజ్‌మెంట్, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మొదలగు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా విద్యార్థినీలను వేధిస్తే షి టీమ్ ఫోన్ నం. 87126 70398 కాల్ చేసి ధైర్యంగా తెల పాలని చెప్పారు.స్కూల్‌కి వచ్చే పోయే సమయంలో ఎవరైనా వేధించిన,ఎవరిపైన అయినా అనుమానం ఉంటే వెంటనే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమ త్తంగా ఉండాలని సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కాల్‌చేసి పోలీసులకు సమాచారంఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో షీ టీం పోలీసులు జ్యోతి, కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. శ్రీను

నారాయణపేట, ఆగస్టు20 ప్రభాతవార్త: జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.శ్రీను సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్